క్లుప్తంగా

బీఆర్‌ఎస్ ఎల్బీనగర్ మహిళా అధ్యక్షురాలిగా రంగేశ్వరి



నాగోలు: బీఆర్‌ఎస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా నాగోలు డివిజన్ బండ్లగూడకు చెందిన ఆలేటి రంగేశ్వరి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెకు శుక్రవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగేశ్వరి మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో ఎల్‌బీనగర్‌లో సుధీర్‌రెడ్డిని భారీ మోజారిటీతో గెలిపించుకుంటామని అన్నారు.

నేడు విద్యార్థుల సత్యాగ్రహ దీక్ష

మలక్‌పేట: టీఎస్‌పీఎస్‌సీని రద్దు చేయాలని, పెంచిన మెస్ చార్జీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూసారం బాగ్ చౌరస్తాలో శనివారం ఈనెల 7న సత్యాగ్రహదీక్ష నిర్వహించనున్నట్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్, గ్రేటర్ అధ్యక్షుడు నక్క వెంకటేష్ తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య హాజరయ్యే ఈ దీక్షకు విద్యార్థులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు రైతు విశ్రాంతి భవనం ప్రారంభోత్సవం

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో నిర్మించిన రైతుల విశ్రాంతి భవనాన్ని శనివారం రాష్ట్ర మంత్రులు నిరంజన్‌రెడ్డి, మహమూద్‌అలీ ప్రారంభిస్తారని మార్కెట్ చైర్‌పర్సన్ అనితానాయక్ శుక్రవారం తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బలాల ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, రూ. 10 లక్షలతో నిర్మించిన విశ్రాంతి భవనం, 33 లక్షలతో నిర్మించిన ఉల్లిగడ్డల షెడ్డును మంత్రులు ప్రారంభిస్తారన్నారు. హమాలీలు, వ్యాపారస్తులు, రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన హోంగార్డుకు అభినందనలు



సీపీ చౌహాన్‌ను కలిసిన లక్ష్మణ్

నాగోలు: డివిజన్ పరిధిలోని జైపురి కాలనీ నివాసి లక్ష్మణ్‌గౌడ్ ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో హోంగార్డుగా కొంత కాలంగా విధులు నిర్వహిస్తున్నాడు. ఒకపక్క విధులు నిర్వహిస్తూనే ... కానిస్టేబుల్ నియామక పరీక్షకు సిద్ధమయ్యాడు. రెండు రోజుల క్రితం వచ్చిన ఫలితాల్లో లక్ష్మణ్‌గౌడ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం అతను రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను మర్యాద పూర్వకంగా కలవగా, లక్ష్మణ్‌ను ఆయన అభినందించారు. లక్ష్మణ్‌గౌడ్‌తో పాటు జైపురి కాలనీకి చెందిన మరి కొంత మంది కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు.

మంత్రి తలసాని జన్మదిన వేడుకలు



కనకదుర్గ గుడి వద్ద కొబ్బరికాయలు కొడుతున్న విఠల్‌రెడ్డి తదితరులు

చైతన్యపురి: చైతన్యపురి మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఆదర్శ అనాథాశ్రమంలో చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. విద్యార్థులకు నోట్ బుక్స్, బిస్కెట్ పాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం దిల్‌సుఖ్‌నగర్ కనకదుర్గ ఆలయంలో తలసాని పేరుతో ప్రత్యేక పూజలు చేసి 101 కొబ్బరి కాయలు కొట్టారు. మున్సిపల్ కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు పవన్, గట్టు శ్రీనివాస్, తిరుమల్ రెడ్డి, జాఫర్, విజయరంగా, సుధాకర్‌నేత, సుదర్శన్‌రెడ్డి, చిన్నయాదవ్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు లారీల అడ్డా తొలగింపు

- ఆటోనగర్ హైవే వద్ద నుంచి టీఎస్‌ఐఐసీ స్థలంలోకి తరలింపు
- 22 కాలనీల ప్రజలకు రణగొణ ధ్వనులు, దుమ్ము, ధూళి నుంచి ఉపసమనం



ఆటోనగర్ వద్ద ఇసుక లారీల యజమానులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: విజయవాడ జాతీయ రహదారిపై ఆటోనగర్ వద్ద ఉన్న ఇసుక లారీల అడ్డాతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడ్డ కాలనీల ప్రజలకు ఎట్టకేలకు ఉపశమనం లభించింది. సమస్య పరిష్కారానికి పలు దఫాలు యత్నించిన ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఇటు లారీ యజమానులను ఒప్పించి, అటు సంబంధిత అధికారులతో మాట్లాడి ఆటోనగర్‌లోని టీఎస్‌ఐఐసీకి చెందిన 12 ఎకరాల స్థలాన్ని ఇసుక, ఇటుక లారీల అడ్డా కోసం కేటాయింపజేయడంతో సమస్య కొలిక్కివచ్చింది. ఆటోనగర్‌లోని ఇసుక లారీల అడ్డా వల్ల రణగొణ ధ్వనులు, దుమ్ము, ధూళితో సమీపంలో ఉన్న 22 కాలనీల ప్రజలు గత 15 సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై 'సాక్షి' పత్రికలో పలుమార్లు కథనాలు కూడా వచ్చాయి. ఈ సమస్య పరిష్కారానికి తీవ్రంగా కృషి చేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శుక్రవారం లారీల అడ్డాకు చేరుకుని అక్కడినుంచి లారీలను టీఎస్‌ఐఐసీ స్థలంలోకి తరలించేలా చర్యలు తీసుకున్నారు. లారీల అడ్డాను కాలనీల చెంత నుంచి తరలించి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సామ తిరుమల్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, వనస్థలిపురం తూర్పు కాలనీల జేఏసీ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డి, నాయకులు శ్రీధర్‌గౌడ్, పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి



రక్త దానం చేస్తున్న శ్రీసాయి కాలేజీ విద్యార్థులు

మలక్‌పేట: యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని శ్రీసాయి డిగ్రీ, పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, సిటీ సర్కిల్ జూబ్లీ, ఆర్టీసీక్రాస్ రోడ్ ఆధ్వర్యంలో శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్ కాలేజీలో చేపట్టిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 100 మందికి పైగా విద్యార్థులు రక్త దానం చేయగా వారికి సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. శ్రీబాలజీ బ్లడ్ సెంటర్ వారు రక్తం సేకరించగా..కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసాచార్యులు, శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శోభారాణి, సుష్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో ప్రారంభం



ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్

మన్సూరాబాద్: తెలంగాణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం, ఫొటో టెక్ సంయుక్త ఆధ్వర్యంలో మన్సూరాబాద్ కేబీఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ నూతన టెక్నాలజీని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గీతా కార్మిక సంక్షేమశాఖ చైర్మన్ పల్లె రవికుమార్, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు కిషోర్‌గౌడ్, ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్, రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఫొటోటెక్ అధినేత అభిమన్యురెడ్డి, పరమేష్, హెచ్ఎస్ నగేష్, ఆస్కార్, వీరేందర్, శైలందేర్, నాగరాజు, జయమాధురి, తులిసి, విజయలక్ష్మి, శారద, రేణుక, నిర్మల, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్‌ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే



యాదగిరినగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బీనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే రోల్‌మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దటమే తన ప్రధాన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రూ 6.80 కోట్ల నిధులతో తలపెట్టిన భూగర్భ డ్రైనేజీ విస్తరణ, సీసీ రోడ్లు, శ్మశాన వాటికలలో మౌలిక సదుపాయాలు, కాలనీ సంక్షేమ సంఘ భవనాల విస్తరణ వంటి పలు అభివృద్ధి పనులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయ చైర్మన్ నల్లా రఘుమారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని మారుమూల, శివారు ప్రాంతాల్లోని కాలనీల్లో కూడా కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. ఇంకా కొన్ని కాలనీల్లో చిన్నపాటి సమస్యలు కూడా ఉన్నాయని, త్వరలో వాటికి కూడా శాశ్వత పరిష్కారం కల్పిస్తామన్నారు. గతంలో సీసీ కెమెరాల కోసం తన కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చిన కాలనీ వాసులందరికీ త్వరలోనే అందిస్తామన్నారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతీ కాలనీవాసి సహకారం తనకు అవసరమన్నారు. కార్యక్రమంలో నాయకులు గజ్జల మధుసూదన్‌రెడ్డి, సుంకోజు కృష్ణమాచారి, ఓరుగంటి వెంకటేష్, ముడుపు రాజిరెడ్డి, రోజారెడ్డి, సుదర్శన్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, అంజిరెడ్డి, అనసూయ, తలారి సత్యప్రకాష్, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

లింగోజిగూడలో....

లింగోజిగూడ డివిజన్ పరిధిలోని కామేశ్వర్‌రావునగర్, సాయినగర్, అల్తాఫ్‌నగర్, విజయపురి, కాకతీయవంటి పలు కాలనీలలో రూ 3.31 కోట్ల నిధులతో తలపెట్టిన సీసీ రోడ్లు, శ్మశానవాటికల్లో మౌలిక సదుపాయాలు, బాక్స్ టైప్, భూగర్భ డ్రైనేజీ విస్తరణ వంటి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై స్థానిక డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు, తెలంగాణ సాధన ఉద్యమకారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. డివిజన్‌లో నూతనంగా ఏర్పడిన బృందావన్ కాలనీలో నూతన డ్రైనేజీ లైన్లు నిర్మించడంతో పాటు సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కాలనీ వాసులు కార్పొరేటర్ పవన్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ శుక్రవారం బృందావన్ కాలనీలో పర్యటించి కాలనీలోని సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే ఆయన జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు ఫోన్ చేసి బృందావన్ కాలనీలో నూతన డ్రైనేజీ లైన్ వేయాలని కోరారు. స్పందించిన డీజీఎం కొత్త డ్రైనేజీ లైన్ వేసేందుకు అంచనాలు వేయిస్తానని చెప్పారు. అనంతరం కాలనీవాసి ఒకరు తమ ఇంటికి తాగునీటిలో డ్రైనేజీ నీరు కలిసి సరఫరా అవుతోందని, కార్పొరేటర్‌ను తీసుకెళ్లి చూపించాడు. వెంటనే కార్పొరేటర్ సంబంధిత లైన్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. పర్యటనలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, రాకేష్, సతీష్, దీపక్, సాయి, భాష, నాయకులు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి కృషి



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: దళితుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సిరిగిరిపురం గేటు పక్కన ఎకర విస్తీర్ణంలో రూ.2 కోట్ల నిధులతో బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్ రామ్ భవనాలకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దేశం గర్వించేలా హైదరాబాద్ నడిబొడ్డున బీఆర్ అంబేద్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర సచివాలయానికి ఆయన పేరు పెట్టి దళితుల పక్షపాతి అని నిరూపించుకున్నారన్నారు. దళితుల సమగ్ర అభ్యున్నతికి దళిత బంధు పథకాన్ని ప్రవేశ పెట్టి రూ.10లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నారన్నారు. మహేశ్వరం మండల కేంద్రంలో 24కుల సంఘాలకు స్థలాలు కేటాయించి భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో దళితులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌లను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకొని స్ఫూర్తిగా ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ కె.సునీతా అంధ్యా నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆనందం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, కల్వకోల్ ఎంపీటీసీ తొంట స్వప్న, కౌన్సిలర్ విలాస్ తదితరులు పాల్గొన్నారు.

మురికివాడల్లో సౌకర్యాలు కల్పించాలని వినతి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్‌లోని పలు మురికివాడల్లో కనీస వసతులు, పలు సౌకర్యాలు కల్పించాలని సీపీఐ ఐఎస్‌సదన్ డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్ కోరారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి ఆయన సైదాబాద్ మండల తహసీల్దార్ జయశ్రీని ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో సింగరేణి కాలనీ, ఖాజాబాగ్, నీలం రాజశేఖర్‌రెడ్డినగర్, సరళాదేవి హట్స్ తదితర మురికివాడల్లో మూడు దశాబ్దాలుగా స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని పలువురు పేదలు జీవిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో పలు రాజకీయ పార్టీల నేతలు బస్తీలను అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చి తర్వాత ముఖం చాటేస్తున్నారని ఆరోపించారు. మురికివాడల్లోని ప్రజలకు బస్తీ దవాఖానా, బాలబాలికల కోసం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గ్రంథాలయం, ఆట మైదానం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆయన తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అంజయ్య, షాబుద్దీన్, సక్రి, దశరథ్ పాల్గొన్నారు.

'అల్పాహారం'తో పేద విద్యార్థులకు ఎంతో మేలు



విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న కార్పొరేటర్ మినాజుద్దీన్, డిప్యూటీ ఈఓ రాధాకృష్ణ, డీసీ జయంత్

మలక్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, సకల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని అక్బర్ బాగ్ కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన అల్పాహారం పథకాన్ని శుక్రవారం మలక్‌పేట హైస్కూల్లో కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పిల్లలు ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సైదాబాద్ డిప్యూటీ ఈఓ తిరునగరి రాధాకృష్ణ, జీహెచ్ఎంసీ సర్కిల్-6 డిప్యూటీ కమిషనర్ జయంత్, ఏఈ వెంకన్న, సీడీపీఓ జ్యోత్స్న, ఇన్‌చార్జి హెచ్ఎం దీప్తి పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్స్ మేళాకు విశేష స్పందన



మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: అందరూ వారానికి ఒక్కసారైనా చేనేత, ఖాదీ వస్త్రాలను ధరించి చేనేత కార్మికులకు చేయూత నందించాల్సిన అవసరం ఉందని ఆలిండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ మేళా చైర్మన్ అక్బర్ అలీ, ప్రధాన కార్యదర్శి గంగాధర్ అన్నారు. వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో కొనసాగుతున్న ఆలిండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ మేళాకు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తోందని వారు చెప్పారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భగల్పూర్, కాంతా వర్క్, బ్లాక్ ప్రింటెడ్, కలంకారీ చీరలతో పాటు గృహోపకరణాలు, కొండపల్లి బొమ్మలు, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, ఖాదీ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజూ ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30 వరకు మేళా తెరచి ఉంటుందని, అన్ని డెబిట్, క్రెడిట్ కార్డులపై కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని అక్బర్ అలీ, గంగాధర్ తెలిపారు.

చదువుతోపాటు ఆటల్లోను రాణించాలి



నాగోలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సురేంద్రనాథ్ యాదవ్

నాగోలు: విద్యార్థులు చదువులోపాటు ఆటలలో రాణించాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నాగోలు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ-సురేంద్రనాథ్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పిల్లలు మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఎదిగేందుకు ఆటలు ఉపయోగపడతాయన్నారు. మీ పిల్లల్ని ఆటలకు దూరంగా ఉంచడమంటే వారిని బాల్యం నుంచి దూరంగా ఉంచడమేనని అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ వెంకట్ రెడ్డి, అనిల్ నాయకులు ప్రభాకర్ గౌడ్, శివకుమార్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన మద్యం మత్తు

- వరుసకు అన్నదమ్ముల మధ్య ఘర్షణ
- ఆటోతో బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్: మద్యం తాగుతుండగా ఇద్దరు వ్యక్తుల మధ్య నెలకొన్న ఘర్షణ.. ఒకరి ప్రాణాన్ని బలి తీసుకోగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మజీద్‌పూర్ పంచాయతీ బుడగ జంగాల కాలనీలో నివాసముండే తూర్పాటి రామచందర్ (36), తూర్పాటి శ్రీశైలంలు వరుసకు అన్నదమ్ములు. ఇరువురూ కలిసి శుక్రవారం రాత్రి బాటసింగారం వైన్స్ వద్ద మద్యం తాగుతుండగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో స్థానికులు వీరికి నచ్చజెప్పి బయటకు పంపించారు. ముందుగా శ్రీశైలం తన ఆటోలో బాటసింగారం వైపు బయలుదేరాడు. ఆ వెంటనే రామచందర్ తన ద్విచక్ర వాహనంపై అదే రూట్‌లో వెళ్తుండగా.. శ్రీశైలం తన ఆటోను వెనక్కి తిప్పాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న రామచందర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఘటనలో రామచందర్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో బోల్తా పడగా శ్రీశైలంకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా ఇద్దరూ మద్యం మత్తులో ఉన్నట్లు నిర్ధారించుకున్నారు. రామచందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి, క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిర్‌పోర్టులో ఉద్యోగం పేరుతో టోకరా

చంచల్‌గూడ: ఎయిర్ పోర్టులో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఖాళీగా ఉందని నమ్మించి ఓ నిరుద్యోగి నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఘటన గత బుధవారం మాదన్నపేట పీఎస్ పరిధిలో జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి... గత నెల 23న మాదన్నపేటకు చెందిన డి. యాదగిరి(39)కి ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి ఫోన్ చేస్తున్నామని అశ్వినీ పేరుతో ఓ మహిళ ఫోన్ చేసింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉద్యోగ అవకాశం ఉందని మాయమాటలు చెప్పి వాట్సాప్ ద్వారా అతడి గుర్తింపు పత్రాలు తీసుకుంది. ట్రైనింగ్, బాండ్ ఫీజు, రిజిస్ట్రేషన్ చార్జీలు, ఆఫర్ లెటర్ కోసమని ఫోన్ పే ద్వారా రూ. 68 వేలు కట్టించుకుంది. తర్వాత మరో రూ. 20 వేలు చెల్లించాలని ఫోన్ చేయగా బాధితుడికి అనుమానం వచ్చింది. మోసపోయానని గ్రహించిన యాదగిరి మాదన్నపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీకి తీవ్రగాయాలు

చంచల్‌గూడ: ఒక వ్యక్తి నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా ఓ రోజువారీ కూలీ కాలును కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై గురువారం రాత్రి మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే పహాడీషరీఫ్‌కు చెందిన ఉర్సు వెంకటేష్ (32) రోజువారీ కూలీ. గత బుధవారం ఇతను చావుణీలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ఉండే తన మిత్రుడు రమేష్ ఇంటికి వచ్చాడు. అక్కడి నుంచి తిరిగి వెళ్లే క్రమంలో డబీర్‌పురా బ్రిడ్జి వైపు రోడ్డు దాటుతుండగా డీసీఎం వాహనం అతడి ఎడమ కాలుపై నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జు అయింది. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రుడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు కాలు తొలగించాల్సి ఉంటుందని చెప్పారని బాధితుడు తెలిపాడు. నిర్లక్ష్యంగా డీసీఎం వాహనాన్ని నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ మహ్మద్ జమీల్ అన్సారీపై చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతివేగం తీసింది ప్రాణం!

- పాదచారుడిని ఢీ కొట్టిన బెంజ్ కారు
- అక్కడికక్కడే మృతి ; కారుతో పరారైన డ్రైవర్
- నెల రోజుల తర్వాత వెలుగులోకి వచ్చిన ఘటన
- సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి గుర్తింపు
- 41-ఏ నోటీసులు జారీ చేసిన పోలీసులు

హయత్‌నగర్: నడుచుకుంటూ వెళ్తున్న పాదచారుడిని వెనక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆపై కారుతో సహా వాహనదారుడు పరారైన ఘటన హయత్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. దాదాపు నెల రోజుల తర్వాత వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హయత్‌నగర్ డివిజన్ శారదానగర్‌కు చెందిన పోషం కృష్ణారెడ్డి(52) పండ్ల మార్కెట్‌లో కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల12న ఉదయం 4:30 గంటల సమయంలో డ్యూటీకి వెళ్లేందుకు ఇంటి నుంచి బయటికి వచ్చిన కృష్ణారెడ్డి భాగ్యలత వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా ఎల్బీనగర్ నుంచి దూసుకువచ్చిన బెంజ్ కారు అతడిని ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన కృష్ణా రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే వాహన డ్రైవర్ కారుతో సహా అక్కడి నుంచి పరారయ్యాడు. రోడ్డు ప్రమాదంగా హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ఢీ కొట్టిన బెంజ్ కారు నంబర్ టీఎస్08 ఈజెడ్6717గా గుర్తించారు. కారు ఓనర్ అరుణోదయ కాలనీకి చెందిన వరాల శ్వేతగా గుర్తించారు. ఆమెను విచారించగా.. మృతుడు కృష్ణారెడ్డిని ఢీ కొట్టిన సమయంలో ఆమె భర్త కుదుముల పవన్ కుమార్ రెడ్డి కారు నడిపినట్లు నిర్ధారించారు. బీమా లేకపోవడంతో కారును సీజ్ చేశారు. డ్రైవర్ పవన్‌తో పాటు కారు యజమాని శ్వేతలకు హయత్‌నగర్ పోలీసులు 41-ఏ సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉండగా.. ఈ కారుపై ఇప్పటికే రాచకొండలో మూడు, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో మూడు ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన చలాన్లు ఉండటం గమనార్హం.


సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్



సరస్వతీనగర్‌లో..చీరలు అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ సామ స్వప్నారెడ్డి



భరత్ నగర్ ఫేజ్-1లో .. కార్పొరేటర్ పవన్‌కుమార్

హస్తినాపురం : పేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శుక్రవారం దసరా పండుగ సందర్భంగా మహిళలకు బతుకమ్మ చీరలను హస్తినాపురంలో పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు రామచంద్రనాయక్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, మమత, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు ప్రభుత్వం సమ ప్రాధాన్యం

సైదాబాద్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల పండుగలు, వేడుకలకు తెలంగాణ ప్రభుత్వం సమ ప్రాధాన్యమిస్తున్నదని బీఆర్‌ఎస్ యాకుత్‌పురా ఇన్‌చార్జ్ సామ సుందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామస్వప్నారెడ్డితో కలిసి సరస్వతీనగర్‌లోని సరస్వతీ శిశుమందిర్‌లో పలువురు మహిళలకు బతుకమ్మ చీరలను అందజేశారు. ఐఎస్‌సదన్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి, కార్తీక్‌గౌడ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

కొత్తపేట డివిజన్‌లో...

నాగోలు: కొత్తపేట డివిజన్ భరత్ నగర్ ఫేజ్-1, మోహన్‌నగర్ కమర్షియల్ టాక్స్ కాలనీ కమ్యూనిటీ హాల్లో కాలనీ మహిళలకు శుక్రవారం కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కాలనీ అధ్యక్షుడు మామిడి రామచందర్, ఆకుల వెంకటేష్, బాలాజీ, యాదగిరి, ఏతమాత్య నాయక్, ప్రేమ్ పాల్గొన్నారు.